26న ఎబిఎస్‌వికె ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలోని మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పక్షవాతం, ఫిట్స్, బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రంలో విజయవాడకు చెందిన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ గోపాళం శివన్నారాయణ, వైద్యులు డి.సందీప్‌వర్మ, జి.పద్మజ, జి.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. తక్కువ ధరలకే అవసరమైన ఔషధాలను నెలలవారీగా అందిస్తారన్నారు. శిబిరానికి వచ్చేవారు ఒక రోజు ముందే షుగర్ పరీక్ష, రక్తపోటు చూపించుకుని రిపోర్టులతో రావాలన్నారు. చేయించుకోలేనివారికి బిపి, షుగర్ పరీక్షలు వైద్య శిబిరంలో ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని కోరారు.

కౌంటింగ్.. కౌంట్‌డౌన్..!

- మరో పది రోజుల్లో ఓట్ల లెక్కింపు
- పటిష్ట ఏర్పాట్లపై అధికారుల ముమ్మర కసరత్తు
- నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- భారీ బందోబస్తు ఏర్పాట్లకు సన్నాహాలు
- బాణసంచా, బల్క్ పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై నిషేధాజ్ఞలు
- అనుమానిత ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు
- అల్లర్ల అదుపునకు ముందుగా మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సమయం దగ్గరపడుతోంది. మరో పది రోజుల్లో అంటే జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నెలకొన్న ఘర్షణలు, అల్లర్లు నేపథ్యంలో అధికారులు ఓట్ల లెక్కింపు రోజు పటిష్ట ఏర్పాట్లు చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియ జరిగేలా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో, పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, ఒక ఎంపీ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎస్ఆర్‌కెఆర్, విష్ణు కాలేజీల్లో జరగనుంది. నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఫలితాలు త్వరితగతిన వెల్లడించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నియోజకవర్గానికి సంబంధించిన ఆర్‌ఒలు స్ట్రాంగ్‌రూములను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. తర్వాత ఇవిఎంల్లోని ఓట్ల లెక్కింపు జరగనుంది. లెక్కింపు రోజు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందుగా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ రోజు ఏవిధంగా నడుచుకోవాలో తెలియజేస్తున్నారు. ఏజెంట్ల నియామకానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా సూచనలు చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతుండటంతో ముందస్తు జాగ్రత్తలపై పోలీస్ యంత్రాంగం సైతం ప్రత్యేక దృష్టి సారించింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద, వివిధ ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి పరిస్థితిని అదుపులోకి తీసుకుంటున్నారు. అల్లర్లు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే దానిపై ముందుగానే మాక్‌డ్రిల్ నిర్వహించి సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు.

నిషేధాజ్ఞలు అమలు

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల రోజు, తర్వాత జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పలు ఆంక్షలు విధించింది. బాణాసంచా అమ్మకాలు, కొనుగోలుపై నిషేధం పెట్టింది. బాటిల్స్, టిన్నుల్లో డీజిల్, పెట్రోల్ అమ్మకాలపై నిషేధం విధించింది. డీజిల్, పెట్రోల్ అమ్మకాలపై నిషేధాజ్ఞలతో జిల్లాలోని ఆక్వారైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కావడంతో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆక్వా చెరువుల్లో ఏరియేటర్స్ తిప్పాలంటే మోటార్లు అవసరం, మోటార్లు తిరిగేందుకు డీజిల్ అత్యవసరం కావడంతో ఆక్వారైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు జిల్లాలోని దెందులూరు నియోజకవర్గంలో ఎన్నికల రోజు చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆ నియోజకవర్గంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. 144 సెక్షన్ అమల్లో ఉండటంతో జనం గుమిగూడదనే ఆంక్షలు కొనసాగుతున్నాయి. గెలుపోటములపై జిల్లాలో బెట్టింగులు జోరు పెద్దఎత్తున కొనసాగుతోంది. దీంతో ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఉత్కంఠ కొనసాగుతోంది.

ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

భారీగా ఫీజుల వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - తణుకు

కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్లు, కాలేజీల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. చట్ట వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ జిఒ 53 ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని, విద్యార్థుల దగ్గర వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు స్కూల్ బయట బోర్డులో ప్రదర్శించాలని నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్పొరేట్, ప్రయివేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా పెంచేస్తున్నాయన్నారు. ప్రభుత్వంగాని, అధికారులుగాని అటువైపు కన్నెత్తి చూడకపోవడం సిగ్గుచేటన్నారు. ఇంత పెద్దఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి మాత్రం చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ కోసం సిపిఎం నిర్వహిస్తున్న ఈ పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, చిట్టూరి రంగారావు, సిహెచ్.రామకృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అకాల వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

ఆచంట కచేరీ సెంటర్లో నీటమునిగిన ఆర్అండ్‌బి రహదారి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో శుక్రవారం గంటకుపైగా వర్షం దంచి కొట్టింది. దీంతో వ్యాపారులు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి వాతావరణం మబ్బు, ఎండతో దోబూచులాడింది. వాతావరణశాఖ హెచ్చరికలు నేపథ్యంలో పట్టణంలో ప్రయాణికుల సంఖ్య తగ్గింది. దీనికి వర్షం కూడా తోడు కావడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి.

ఆచంట: భానుడి భగభగలతో అల్లాడుతున్న వేళ శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో చిన్నా పెద్ద తేడా లేకుండా అంతా వర్షంలో కేరింతలు కొట్టారు. భారీ వర్షం కారణంగా పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆచంట కచేరీ సెంటర్లో ఆచంట-మార్టేరు ఆర్అండ్‌బి రహదారి నీట మునగడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

పాలకొల్లులో కురుస్తున్న వర్షం

మొగల్తూరు: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులతో వర్షం కురిసింది. సుమారు 20 రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో తల్లడిల్లిన ప్రజలు ఈ వర్షంతో కొంత ఉపశమనం చెందారు.

నరసాపురం : ఉప్పు రాసులపై బరకాలు కప్పిన రైతులు

పెనుగొండ: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం మారింది. సాయంత్రం సమయంలో భారీ వర్షం కురవడంతో ధాన్యం రైతులు ఉరుకులు పరుగులు తీశారు. ఆరబెట్టిన ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు నానావస్థలు పడ్డారు.

నరసాపురం: శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇంకా వరి మాసూళ్లు సాగుతున్నాయి. పొలాల గట్లపై ఇంకా ధాన్యం రాశులు ఉన్నాయి. నరసాపురం తీరంలో చినమైనవానిలంక, పెదమైనవాని లంక గ్రామాల్లో ఉప్పుమడుల రాశులను రక్షించుకునేందుకు రైతులు పరుగులు తీశారు. బరకాలు కప్పి ఉప్పు పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

రైతులకు ఆమోదయోగ్యమైన పరిష్కారం

ఒఎన్‌జిసి పైపులైన్‌పై కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఒఎన్‌జిసి పైపులైన్ వెళ్తున్న యర్రంశెట్టివారి పాలెం రైతులకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని చూపించామని, రైతులు అంగీకరించడంతో ఒఎన్‌జిసి పైపులైన్ పనులు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో సీతారామపురంసౌత్, యర్రంశెట్టి వారిపాలెం, రుస్తుంబాద గ్రామాల రైతులతో, ఒఎన్‌జిసి అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ గత సమావేశంలో కొన్ని పరిష్కార మార్గాలను రైతుల ముందు ఉంచామన్నారు. ఈ సమావేశంలో ఒఎన్‌జిసి పైపులైన్ల నిర్మాణానికి రైతుల ఆమోదంతో పూర్తి పరిష్కారాన్ని చేశామని తెలిపారు. ఇప్పటికే యర్రంశెట్టివారిపాలెంలో పైపులైన్లు వెళ్తున్న మార్గంలో రోడ్డుకి ఆనుకుని ఉన్న భూములను సర్వే చేయించి వాస్తవ హక్కుదారులను 70 మందిని గుర్తించామన్నారు. 70 మంది రైతులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.35 లక్షలు ఒఎన్‌జిసి సిఎస్ఆర్ నిధుల నుండి చెల్లించడానికి ఆ సంస్థ అంగీకరించిందని తెలిపారు. దీంతోపాటు ఒఎన్‌జిసి పైప్‌లైన్లు వెళ్లే మూడు గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ.15 లక్షల చొప్పున రూ.45 లక్షలు గ్రామాల అభివృద్ధికి నిధులను ఒఎన్‌జిసి మంజూరు చేస్తుందన్నారు. పైపులైన్లు వెళ్లే మార్గంలో భూముల క్రయ విక్రయాలకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. వైఎస్‌పాలెం సర్పంచి యర్రంశెట్టి బాబులు, రైతు ప్రతినిధులు యర్రంశెట్టి హరికృష్ణ తదితరులు రోడ్డుకు అవతలి వైపు ఉన్న 44 మంది రైతులతో కలిపి మొత్తం 114 మంది రైతులకు పరిహారాన్ని ఒఎన్‌జిసి ద్వారా అందించాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల మేరకు అది సాధ్యం కాదని, 70 మంది రైతులకు మాత్రమే పరిహారాన్ని అందిస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, నరసాపురం డిఎస్‌పి శ్రీనివాసరావు, ఒఎన్‌జిసి జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) జాన్‌వెస్లీ, జనరల్ మేనేజర్ (ప్రాజెక్టు) శ్యామ్‌రాజ్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, వైఎస్ పాలెం సర్పంచి యర్రంశెట్టి బాబులు, మూడు గ్రామాల రైతుల ప్రతినిధులు డి.వెంకట్, బి.రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

నేడు డివైఇఒ నియామక పరీక్ష

840 మంది అభ్యర్థులకు జిల్లాలో 6 సెంటర్లు

డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

డివైఇఒ నియామక పరీక్ష ఈ నెల 25న జిల్లాలో ఆరు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు, ఈ పరీక్షకు 840 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఈ పరీక్షల నిర్వహణపై ఎపిపిఎస్‌సి అధికారులు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో భీమవరం డిఎన్ఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగు టెక్నాలజీలో 130, భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వంద మంది, భీమవరం దంతులూరి నారాయణరాజు (అటానమస్) కాలేజీలో 100, నరసాపురం స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజినీరింగు అండ్ టెక్నాలజీలో 100, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగు కాలేజీలో 250, తాడేపల్లిగూడెం శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగులో 160 మొత్తం 840 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని వివరించారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ఉదయం 9 గంటలు నుండి 11:30 గంటలు వరకు జరుగుతుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 7.30 గంటల నుండి 8.15 వరకు, గ్రేస్ పీరియడ్ కలుపుకుని 8.30 వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక్కో చీఫ్ సూపరింటెండెంటు, ఒక్కో లైజన్ ఆఫీసరు చొప్పున నియమించినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఎలాంటి పేపర్లు, మొబైల్ ఫోన్లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కాలిక్యులేటర్, ట్యాబ్‌లు, ఐపాడ్, బ్లూటూత్, పేజర్‌లు లేదా ఇంటరాక్ట్ చేయగలిగిన ఇతర పరికరాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు తీసుకురావొద్దని, వాటిని అనుమతించబోరని తెలిపారు. అభ్యర్థులకు అనువుగా ఆర్‌టిసి బస్సులు నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆయన ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారులు గిరిజ, అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, ఎపిఎస్ఆర్‌టిసి పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, లైజనింగు అధికారులు, కాలేజీ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము వెంటనే ఇవ్వాలి

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా సమావేశం

ప్రజాశక్తి - భీమవరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సొమ్ము వెంటనే విడుదల చేయాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో కేతా గోపాలన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం డబ్బు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేడు వ్యవసాయం చేసేదంతా కౌలురైతులేనని అన్నారు. వారికి ప్రభుత్వం నుండి ఎటువంటి ఆసరా లేకపోయినా అధిక వడ్డీలకు ప్రయివేటు అప్పులు తెచ్చి పంటలు పండిస్తున్నారన్నారు. ప్రభుత్వం నెలలు తరబడి డబ్బులు వేయకపోతే కౌలురైతుల కష్టార్జితం అంతా అప్పుల వడ్డీలకే సరిపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ధాన్యం సొమ్ము విడుదల చేయడంతో పాటు పంట కాలువలు, మురుగు కాలువల ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, సభ్యులు పి.నర్సింహమూర్తి, సిహెచ్.శ్రీనివాసు, కె.శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరిబాబు

సిపిఎఫ్ కంపెనీ మూతపై చర్యలు తీసుకోవాలి

కార్మికులకు న్యాయం చేయాలి - సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గణపవరం మండలం సరిపల్లిలో ఉన్న సిపిఎఫ్ కంపెనీని అక్రమంగా మూసివేసి కార్మికుల పొట్ట కొట్టడం తగదని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎఫ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల యాజమాన్యం చట్ట విరుద్ధంగా కంపెనీని మూసివేయడం దారుణమని పేర్కొన్నారు. ఉన్న ఉద్యోగాలనే కాపాడలేని పాలకులు కొత్త ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానాలు చేయడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. గత 11 ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికుల పొట్టకొట్టి అక్రమంగా లాకౌట్ ప్రకటించడం అన్యాయమని పేర్కొన్నారు. స్థానిక యూనియన్‌ను పరిగణనలోకి తీసుకోకుండా, కార్మికులతో చెప్పకుండా దొంగచాటుగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. దేశంలో అనేక ప్రాంతాల్లో సిపిఎఫ్ కంపెనీలు ఉన్నాయని, ఎక్కడా నష్టాలు రావడంగాని, మూసివేతలుగాని లేవని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కౌంటింగ్‌పై కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జూన్ 4న కౌంటింగ్ గురించి తెలుసుకునేందుకు మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను శుక్రవారం కలిశారు. కౌంటింగ్‌కు ఎన్ని టేబుల్స్ వేస్తున్నారు, ఎన్ని రౌండ్లలో ఫలితాలు వెలువడుతాయి, ఎంతమందిని లోపలికి అనుమతిస్తారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కౌంటింగ్ విధివిధానాలు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కించేటప్పుడు జాగ్రత్తలు, తొలివిడత, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. అంజిబాబు వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు ఉన్నారు.



కలెక్టర్‌ను కలిసిన అంజిబాబు

12 రౌండ్లలో నరసాపురం ఫలితం

భీమవరం విష్ణు ఫుడ్‌ప్లాజాలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్

చిట్‌చాట్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు భీమవరం విష్ణు కళాశాల ప్రాంగణంలోని ఫుడ్‌ప్లాజా వద్ద అన్ని ఏర్పాట్లూ చేశామని నరసాపురం ఆర్‌డిఒ, రిటర్నింగ్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్ తెలిపారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జూన్ 4న 14 టేబుల్స్‌పై నరసాపురం నియోజకవర్గ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నామన్నారు. మొత్తం 12 రౌండ్లలో ఫలితం వెలువడనుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు నాలుగు టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో 1,70,448 మంది ఓటర్లు ఉండగా ఈ నెల 13న పోలింగ్ రోజు 169 పోలింగ్ కేంద్రాల్లో 1,43,825 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మొత్తం 84.38 శాతం ఓటింగ్ నమోదైందన్నారు. 1489 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను

వినిగించుకున్నారని తెలిపారు. 73 మంది సర్వీస్ ఓటు కోసం దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకున్నారని, వీరిలో 26 ఓట్లు ఇప్పటి వరకూ అందాయని వివరించారు. జూన్ 4వ తేదీ ఉదయం 7.59 గంటల వరకు అంటే లెక్కింపు రోజు చివరి నిమిషం వరకు సర్వీస్ ఓట్లను స్వీకరించి లెక్కిస్తామని తెలిపారు. 112 హోమ్ ఓట్లు ఉండగా 106 మంది వినియోగించుకున్నారని చెప్పారు. ఓట్ల లెక్కింపు తొలుత నరసాపురం మండలం కంసాలబేతపూడి ఒకటో నెంబర్ పోలింగ్ బూత్ నుంచి మొదలవుతుందని, నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామం 169 పోలింగ్ బూత్‌తో పూర్తవుతుందని చెప్పారు. కౌంటింగ్‌కు ముందు, తర్వాత ఎటువంటి అల్లర్లు, హింసాత్మక ఘటనలకు పాల్పడరాదన్నారు. కౌంటింగ్ హాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో ఫోను అనుమతి లేదన్నారు. ఒకసారి లోపలికి వెళ్తే బయటకి రానీయరన్నారు. ఒక్కో రౌండ్‌లో 14 ఇవిఎంలు చొప్పున లెక్కిస్తారన్నారు. చివర్లో మిగిలిన ఒక ఇవిఎంను విడిగా లెక్కిస్తారన్నారు. తొలుత ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ప్రారంభమవుతుందని, 8.15 నిమిషాలకు ఇవిఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని అంబరీష్ తెలిపారు.

6లోపు సభలు, ర్యాలీలు నిర్వహించరాదు

నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జూన్ ఆరో తేదీలోపు ఎటువంటి సమావేశాలు, సభలు, ర్యాలీలు నిర్వహించరాదని నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాణాసంచా కాల్చొద్దన్నారు. పోలింగ్‌కు సహకరించినట్లు కౌంటింగుకూ సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అసాంఘిక చర్యలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అల్లర్లు సృష్టించేవారిపైనా, అల్లర్లకు పాల్పడేవారిపైనా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు కెఎ.స్వామి, కె.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాస్

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు

ఉపాధి కూలీలంటే అంత నిర్లక్ష్యమా

సిఐటియు నేత ఆంజనేయులు

ప్రజాశక్తి - వీరవాసరం

ఉపాధి కార్మికుల పట్ల పాలకులకు కనికరం లేదని, వారంతే ఎందుకంత నిర్లక్ష్యమని సిఐటియు జిల్లా నాయకులు ఎం. ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని అండలూరు గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తు ప్రాంతాలకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తీవ్రమైన ఎండల్లోనూ ఉపాధి పనులకు కూలీలు వస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. చట్టప్రకారం పని ప్రదేశాల్లో టెంట్, తాగునీరు, మజ్జిగ, వైద్య పరికరాలు వంటి సదుపాయాలేమీ కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఎన్ని రోజులు పని చేశాము, పని చేసిన దానికి ఎంత వేతనం వస్తుంది అనేవి చూసుకోవడానికి పే స్లిప్ గాని మస్టర్ కార్డుగాని ఉనికిలో లేకుండా చేశారని అన్నారు. నవుడూరు వంటి మేజర్ గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ లేరని పనులు చూపించకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి ఉపాధి హామీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

హెల్పింగ్ హాండ్స్ కాళ్ల గ్రామ యువత పోసింశెట్టి కనకదుర్గ కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. కాళ్లకు చెందిన పోసింశెట్టి కనకదుర్గ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ కాళ్ల యువత కొంతమంది ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. హెల్పింగ్ హాండ్స్ తరపున సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, గంజాల శ్రీనివాసు, గనిశెట్టి సురేష్, మేకా కాళీ చరణ్, ఆరేటి దిలీప్, పాపోలు శేషు గ్రామస్తులు ఆరేటి సుబ్బారావు, బండారు చంటి, పొట్టిపోతుల పకీర్, శకమూడి పెద్దిరాజు మైడి తాతా పండు కలిసి మొత్తం రూ.32 వేల నగదును కనకదుర్గ కుమారుడు పోసింశెట్టి కుమార్‌కు అందజేసి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఛాంబర్స్ కళాశాలలో బిబిఎ కోర్సుకు ఎఐసిటిఇ ఆమోదం పొందిన లెటర్ ఆవిష్కరిస్తున్న యాజమాన్యం

ఛాంబర్ కళాశాలలో బిబిఎ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈ ఏడాది నుంచి న్యూఢిల్లీలోని ఎఐసిటిఇ గుర్తింపుతో బిబిఎ కోర్సు ప్రారంభి స్తున్నట్లు ఆ కళాశాల అధ్యక్షులు కారుమూరి నరసిం హారావు చెప్పారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండున్నర సంవత్సరాలుగా ఛాంబర్ కళాశాలలో విద్య అభ్యసించిన పాలకొల్లు పరిసర ప్రాంత సామాన్య విద్యార్థులు 850 మందికిపైగా క్యాంపస్ ఇంటర్వ్యూలు సాధించారని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ పోటీగా ఉన్న బిబిఎ కోర్సును తమ కళాశాలలో ప్రారంభించడం సంతోషంగా ఉందని కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు చెప్పారు. మంచి ఫ్యాకల్టీతో ఇప్పటికే ఇంటర్, డిగ్రీ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందుతున్న ఘనత ఛాంబర్ కళాశాలకు దక్కిందని ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బల్లలు ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొల్లు

యునైటెడ్ కాపు వనిత సర్వీస్ క్లబ్, పాలకొల్లు వారి ఆధ్వర్యంలో బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థం స్థానిక నరసాపురం రోడ్డు అయ్యప్పస్వామి గుడి వంతెన వద్ద, కాలువ గట్టుపై గల కనకదుర్గ అమ్మవారి గుడి వద్ద, గాంధీ బొమ్మల సెంటర్లో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చెర్ల సంజయ్, క్లబ్ ఫౌండర్ జక్కంపూడి కుమార్, పెనుమాక రామ్మోహన్, జక్కంపూడి మదన్, మంగిన సాయి పాల్గొన్నారు. బిజెపి పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడి సభ్యులను అభినందించారు. వనిత క్లబ్ ప్రెసిడెంట్ మంగిన అరుణ మాట్లాడుతూ బల్లల ఏర్పాటుకు సహకరించిన ముచ్చెర్ల సంజయ్, కొండ్రెడ్డి సూరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శిద్దిరెడ్డి శైలజా రాణి, కావలి మౌని, రావి సృజన, నార్ని సూర్యకుమారి పాల్గొన్నారు.

ఆశాలు, ఎఎన్ఎంలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నవ్యజీవన్

కిల్కారీ యాప్‌పై గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రతి గర్భిణీ ఆరోగ్యకరమైన పండంటి బిడ్డకు జన్మనివ్వడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి ఆరోగ్యకరమైన విషయాలపై అవగాహన కల్పించాలని లంకలకోడేరు వైద్యాధికారిని డాక్టర్ ఎం.నవ్యజీవన్ తెలిపారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు గర్భిణులకు కిల్కారీ మొబైల్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సేవల వల్ల గర్భిణికి నాలుగు నెలల నుంచి బిడ్డ పుట్టే వరకూ కిల్కారీ మొబైల్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతిరోజూ ఆశా కార్యకర్తలు ప్రతి గర్భిణీ స్త్రీ ఇంటికెళ్లి వారికి కిల్కారీ మొబైల్ సేవల గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కార్డు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్‌పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్ డి.కమల, ఎస్‌కె.అమలేశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శుక్రవారం కాకి సమయస్ఫూర్తి, నిజాయితీ విలువ కథలను గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్ కుమారి పిల్లలకు వివరించారు. తామరపు కృష్ణ కరాటేలో శిక్షణ ఇచ్చారు. స్కూల్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్ యోగాలో శిక్షణ ఇచ్చిన అనంతరం క్యారమ్స్ ఆడించారు. ఈ సమ్మర్ క్లాసులను పిల్లలు ఉపయోగించుకొనాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కుమారి కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

స్మైక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ డి.రమేష్

ఆచంటలో స్మైక్ విద్యాసంస్థ

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధనతోపాటు సామాజిక బాధ్యత గల మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే స్మైక్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లక్ష్యమని ఆ స్కూల్ ప్రిన్సిపల్ డి.రమేష్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆచంటలో గత నాలుగు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంలో తమ స్కూల్ ముందుందన్నారు. ఆధునిక వసతులతో సువిశాలమైన ప్రాంగణంలో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో సగర్వంగా నడుపుతున్న విద్యాసంస్థ స్మైక్ అని అన్నారు. మండలంలో అతి తక్కువ ఫీజులతో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యా బోధన సాగిస్తున్న ఏకైక విద్యాసంస్థగా తమ సంస్థ పేరొందిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో తరచూ సమీక్షా సమావేశాలు నిర్వహించడమేకాక ఏడాదికి రెండుసార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ప్రతి సబ్జెక్టులో క్విజ్ పోటీలు నిర్వహించడం తమ ప్రత్యేకతని వివరించారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో మానసికోల్లాసాన్ని కలిగించేందుకు, యోగా, వ్యాయామం, కుంగ్‌ఫూ, డ్యాన్స్, సంగీతం తదితర వాటిలో శిక్షణ అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ స్మైక్ అని అన్నారు. విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల స్థాయిలో చెస్, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎందరో విద్యార్థుల భవితకు బంగారు బాట వేసిన సంస్థ స్మైక్ అని అన్నారు. విద్యతోపాటు శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు విహారయాత్రలు చేపడుతున్నామని వివరించారు. స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానం, అబాకస్‌లో శిక్షణ, డిజిటల్ క్లాస్‌రూమ్ తమ ప్రత్యేకతలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన తమ విద్యాసంస్థలో నర్సరీ నుండి పదో తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని రమేష్ తెలిపారు.

స్మైక్ ప్రత్యేకతలు..

- అనుభవజ్ఞులైన, అర్హులైన బోధనా సిబ్బందితో తరగతులు
- అతి తక్కువ ఫీజులతో అత్యున్నత ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన
- విద్యార్థులందరికీ వీక్లీ, మంత్లీ టెస్టులు, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ
- విద్యార్థులందరికీ స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, అబాకస్‌ల్లో ప్రత్యేక శిక్షణ
- దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాసు వారు నిర్వహించే పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు ప్లే వే మెథడ్, డిజిటల్ క్లాసుల్లో విద్యాబోధన
- రెండంతస్తుల బిల్డింగులు, విశాలమైన గదుల్లో తరగతులు, సువిశాలమైన ఆట స్థలం
- నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి విద్యార్థులకు ఎసి క్లాస్‌రూముల్లో విద్యా బోధన
- కరాటే, కుంగ్‌ఫూ, డ్యాన్స్‌ల్లో అనుభవజ్ఞులైన కోచ్‌లచే ప్రత్యేక శిక్షణ
- విద్యార్థులకు మినరల్ వాటర్ సదుపాయం

అత్యున్నత ఫలితాల సాధనే లక్ష్యం

కొమ్ముచిక్కాల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పోడూరు

పేద, మధ్యతరగతి విద్యా ర్థులను కార్పొరేట్ విద్యా సంస్థల్లోని విద్యార్థులతో పోటీ పడేలా తీర్చిదిద్దడం, అత్యున్నత ఫలితాలు సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. కొమ్ము చిక్కాలలోని సర్ధార్ దండు నారాయణరాజు జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయ బృందం. విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. 1969లో స్థాపించిన ఈ పాఠశాల ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. కొమ్ముచిక్కాలతోపాటు పి.పోలవరం నుండి కూడా విద్యార్థులు వచ్చి ఇక్కడ విద్యాభ్యాసం సాగిస్తున్నారు. విశాలమైన క్రీడా ప్రాంగణం, తరగతి గదులు, కళావేదిక, చుట్టూ ప్రహరీతో స్కూల్ ఎంతో ముచ్చటగా విద్యార్థులను ఆకట్టుకుంటుంది.

కొమ్ముచిక్కాలలోని సర్ధార్ దండు నారాయణరాజు జెడ్‌పి హైస్కూల్

ఫలితాల్లో టాప్..

గత ఐదేళ్లుగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కొమ్ముచిక్కాల హైస్కూల్ విద్యార్థులే మండలస్థాయిలో ముందంజలో ఉంటూ అత్యున్నత ఫలితాలు సాధిస్తున్నారు. గత ఏప్రిల్‌లో విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలం ప్రథమ స్థానంలో కొమ్ముచిక్కాల జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని ఇమ్మలరాజు మోక్షిత వెంకట సాయిదుర్గా కార్తీక నిలిచారు. స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి మంచి ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ సాగిస్తున్నారు.



ప్రత్యేక ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు

పంపన శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, కొమ్ముచిక్కాల

ప్రత్యేక ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నాం. ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మా పాఠశాల మండలస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. పది పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. మూడు నెలలు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేశాం. పండగ సెలవుల్లో, రెండో శనివారం సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేశాం. దీనికి విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా సహకరించారు.

కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజకుమార్

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు, ఎవరైనా హింసాత్మక చర్యలు, అల్లర్లకు పాల్పడితే ఏ విధంగా నియంత్రించాలనే అంశంపై శుక్రవారం సాయంత్రం పెదమల్లం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో ఎస్ఐ రాజకుమార్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసాలకు పాల్పడితే అణచివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటామో ముందస్తుగా అత్యవసర సమయాల్లో తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. అల్లర్లు, విధ్వంసాలకు ప్రేరేపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన రాజకీయ పార్టీల నాయకులు బాణసంచా కాల్చడం, ర్యాలీలు చేయడం ఉత్సవాలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవన్నారు.

ఆకివీడు : ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు, తరువాత ఎటువంటి వివాదాస్పద సంఘటనలకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎస్ఐ ఎం.నాగబాబు అన్నారు. ఎన్నికల ఫలితాలు త్వరలో రానున్న నేపథ్యంలో మండలంలోని కుప్పనపూడి, గుమ్ములూరు గ్రామాల్లో శుక్రవారం పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలతో పోలీసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ ఫలితాలు వెలువడిన రోజు బాణసంచా సామగ్రి కాల్చేందుకు అనుమతులు లేవన్నారు. ముందుగా ఆయన సిబ్బందితో కలిసి పెద్దపేట, సాలిపేట తదితర ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - తణుకు

పట్టణంలో చిట్టూరి హెరిటేజ్ పక్కన ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో ఆలపాటి లక్ష్మీనారాయణమ్మ (55) గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. 20 ఏళ్లుగా లక్ష్మీనారాయణమ్మ తణుకు మండలం దువ్వ గ్రామంలో నివాసం ఉంటున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తణుకు బ్రాంచిలో నగదు లావాదేవీల కోసం లక్ష్మీనారాయణమ్మ తన భర్తతో కలిసి బ్యాంకుకు వచ్చింది. అక్కడ గుండెపోటు రావడంతో అక్కడికక్కడే లక్ష్మీనారాయణమ్మ మృతి చెంది. దీనిపై తణుకు పట్టణ ఎస్ఐ శ్రీనివాసరావును వివరణ కోరగా తమకు ఏలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

దిగుబడి తక్కువొస్తున్న ప్రాంతాల్లో భూసార పరీక్షలు

వ్యవసాయాధికారులను ఆదేశించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లాలో తక్కువ దిగుబడి వస్తున్న పంట పొలాల ప్రాంతాలను గుర్తించి భూసార పరీక్షలను నిర్వహించాలని, సంబంధిత రైతులకు మేలైన వరి వంగడాలను అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఖరీఫ్-2024 సన్నద్ధతపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ దిగుబడి వస్తున్న పంట పొలాల రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలు నిర్వహించడంతోపాటు మేలైన వంగడాలు విత్తుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా లాభసాటి పంట సాగుపై అవగాహనా తరగతులు నిర్వహించడంతోపాటు శిక్షణ సమయంలో తీసిన ఫొటోలు అందజేయాలన్నారు. తక్కువ దిగుబడి వస్తున్న ప్రాంతాలను గుర్తించి, పొలంబడి కార్యక్రమంలో సంబంధిత రైతులకు అవగాహన కల్పించడం ద్వారా ఉపయోగం ఉంటుందన్నారు. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొరత లేకుండా చూడాలన్నారు. కాజ డ్రెయిన్, నందమూరు అక్విడెక్ట్ పూడికతీత పనులకు చర్యలు చేపడతామన్నారు. గునుపూడి సౌత్, మొగల్తూరు డ్రెయిన్లలో కిక్కిస, తూడు కారణంగా నీటిపారుదలకు ఆటంకం కలిగి పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని పలువురు రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి వెంటనే కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 96,925 హెక్టార్లలో వరి సాగుకు, 5,740 మెట్రిక్ టన్నులు దిగుబడి లక్ష్యంగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2023-24 సంవత్సరంలో 15,032 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా, దీనిలో ఖరీఫ్ 2023 సీజన్లో 10 వేల మట్టి నమూనాల లక్ష్యానికి 10,316 ఆర్‌బికెల ద్వారా సేకరించి తాడేపల్లిగూడెం సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపారన్నారు. మిగిలిన 4,716 మట్టి నమూనాల సేకరణను ఆర్‌బికెల ద్వారా ఈ నెల 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో 48,463 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం ఉందని, విత్తనాల కొరత లేదని, వంద క్వింటాళ్ల వరకు కేజీకి ఐదు రూపాయలు చొప్పున సబ్సిడీపై వరి విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎంటియు 1318, 7029, 1061, 1064, స్పందన స్వర్ణ, పిఆర్ 126 వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో ఖరీఫ్ 2024 పంటకు 21,272 మెట్రిక్ టన్నుల యూరియా, 23,464 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 2,391 మెట్రిక్ టన్నుల డిఎపి, 6,391 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పి, 5,387 మెట్రిక్ టన్నుల ఎంఒపి మొత్తం 58,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందన్నారు. వీటిలో ఎపి మార్క్‌ఫెడ్ వద్ద 3,008 మెట్రిక్ టన్నులు, హోల్‌సేలర్స్ వద్ద 29,293 మెట్రిక్ టన్నులు, రిటైలర్స్ వద్ద 11,446 మెట్రిక్ టన్నులు మొత్తం 45,324 మెట్రిక్ టన్నుల ఎరువులు ఈ నెల 23 నాటికి అందుబాటులో ఉన్నాయన్నారు. మండలాలవారీగా రైతుభరోసా కేంద్రాల్లో 1,488 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 2024 ఖరీఫ్‌కు పంట రుణాలు రూ.4,179 కోట్లు, టర్మ్ లోన్స్ రూ.3,116 కోట్లు మంజూరుకు నిర్ణయించామన్నారు. 2023-24 సంవత్సరానికి 84,185 సిసిఆర్ కార్డులు లక్ష్యం కాగా 90,053 సిసిఆర్‌సి కార్డులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, ఉండి కెవికె, మార్టేరు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, నీటిపారుదల, రైతునేత పాతపాటి మురళీ రాజు, రైతులు పాల్గొన్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు 103 మంది హాజరు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 103 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. గురువారం తెలుగు, సంస్కృతం పరీక్షలు శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం, ఇన్‌ఫెంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జెడ్‌పి హెచ్ స్కూల్లో జరిగాయి. మొత్తం 282 మంది విద్యార్థులకు గాను, 103 మంది హాజరయ్యారని, 179 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కడకట్ల, వీకర్స్ కాలనీ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 29, 30, 5, 3 వార్డుల్లో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆరోగ్య సర్వే, ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల వృద్ధి చెందకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బాలు, టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు బేబీ, సుష్మ, సరళ, ఆశాలు పాల్గొన్నారు.

ఈసారి నరసాపురంలో ఓటింగ్ తక్కువే..!

ప్రజాశక్తి - నరసాపురం

ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండుగకు చాలా మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. నరసాపురం నియోజకవర్గంలో 1,70,448 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,43,825 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ కారణాల రీత్యా 26,623 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. వృత్తి, వ్యాపార, విద్యావసరాల దృష్ట్యా పొరుగు రాష్ట్రాల్లో, జిల్లాల్లో ఉంటున్న నియోజకవర్గ ఓటర్లు ఎక్కువ మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న విద్యావేత్తల్లో అధిక శాతం పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఓటేయడానికి ఓటర్లు కనీసం మూడు నుంచి నాలుగు గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇవిఎంలు మొరాయించడం, పోలింగ్ నెమ్మదిగా సాగడంతో చాలా మంది రెండు, మూడు సార్లు కేంద్రాలకు వచ్చి తిరిగి వెళ్లిపోయారు. కేంద్రాల వద్ద సరైన సదుపాయాలు లేకపోవడమూ వారి సహనానికి పరీక్ష పెట్టింది. ఒక్క పక్క ఎండ, ఉక్కపోత, మరోపక్క ఏర్పాట్లు సరిగ్గాలేని కారణంగా చాలామంది వెనుతిరిగారు. ఒక్క బూత్‌లో 1200 నుంచి 1500 పైగా ఓట్లు ఉండడంతో చాలా ఆలస్యమైంది. బయట రాష్ట్రాల నుంచి రావడానికి రవాణా సదుపాయాలు సరిగ్గా లేక చాలామంది రాలేకపోయారు. కొన్ని కేంద్రాల వద్ద అర్ధరాత్రి వరకూ పోలింగ్ జరిగింది.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉండి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఉండి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. శుక్రవారం పెద్దపుల్లేరులో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ సాయిచంద్ర మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారి బాధలు తొలగించేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి కావాల్సిన స్కానింగ్ కోసం సంబంధిత ఆసుపత్రికి సిఫార్సు చేస్తామని తెలిపారు. రోగులకు అవసరమైన ఇసిజి, పలు రకాల రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s.Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep.by its Branch Manager it is stated that Bosetti Himanth Mithra, S/o.Laxmana Rao, 27 Yrs, R/o.H.No.3-96, Makkinavari gudem, T.Narsapuram Mandal, Eluru District is creating mortgage against his property shown below as security for the proposed trade loan. If any body having any objection, they can send the objections to me or to my client with in 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SCHEDULE OF THE PROPERTY

RCC Building bearing H.No.3-96 along with its house site of an extent of 121 Sq.yards or 0.02 1/2 cents out of 0-13 cents in R.S.No.96-1 situated at Makkinavarigudem village and Panchayath, T.Narsapuram Mandal, Eluru District bounded by:
East: Place of Bosetti Charan Satya Sai Manikanta
South : Road
West: Place of Sivalayam
North : Place of Gudidala Venkulu

P.Ganesh Babu
Advocate, Kothagudem